ఆటో షోలో పవన్ మోటర్స్ సేల్స్ మేనేజర్ జానీపాషాకు మెమెంటోను అందిస్తున్న నల్లగొండ జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, నమస్తే తెలంగాణ బృందం, ఆటోషోకు తరలివచ్చిన సందర్శకులు

మెగా ఆటో షో గ్రాండ్ సక్సెస్

ముగింపు కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ నరేందర్‌రెడ్డి

నల్లగొండలో 'నమస్తేతెలంగాణ, తెలంగాణ టుడే' నిర్వహణ ● చివరి రోజు భారీగా తరలివచ్చిన వాహన ప్రియులు

రామగిరి, ఏప్రిల్ 7: వాహన ప్రియులు షోరూంలకు వెళ్లకుండా.. నచ్చిన కంపెనీ వాహనాలను కొనుగోలు చేసేలా.. వివిధ రకాల కంపెనీల వాహనాలను ఒకే వేదికపై అందుబాటులో ఉంచుతూ ఆటో షో ఏర్పాటు చేయడం అభినందనీయమని నల్లగొండ జిల్లా పరిషత్ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల మైదానంలో 'నమస్తేతెలంగాణ, తెలంగాణ టుడే' ఆధ్వర్యంలో రెండ్రోజులపాటు నిర్వహించిన మెగా ఆటో షో ఆదివారం రాత్రి అట్టహాసంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ.. ఒకే దగ్గర అన్ని రకాల కంపెనీల వాహనాలను ప్రదర్శించడం వాహన ప్రియులకు మంచి అవకాశమని తెలిపారు. ఓ వైపు సమాజంలోని మంచి, చెడులపై సంచలనాత్మకమైన వార్తలను రాసి ప్రజలను చైతన్యం చేస్తూనే.. మరోవైపు వాహన ప్రియుల అభిరుచులకు అనుగుణంగా ఆటో షోలు ఏర్పాటు చేయడం హర్షణీయమని చెప్పారు. వాహనాలు తీసుకున్న వారికి తక్షణం రుణం అందించేలా బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలను అందుబాటులో ఉంచడం సంతోషకరమని వివరించారు. నల్లగొండ వంటి ద్వితీయ శ్రేణి పట్టణాల్లో రెండోసారి ఆటో షో నిర్వహించడం శుభ పరిణామమని పేర్కొన్నారు. మెగా ఆటో షో చివరి రోజున సందర్శకులు భారీ సంఖ్యలో పాల్గొని తమకు నచ్చిన పలు సంస్థల కార్లు, బైక్‌లను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన సాంస్కృతిక, సంప్రదాయ, జానపద నృత్యాలు అలరించాయి. 'నమస్తేతెలంగాణ' తరపున స్టాల్స్ నిర్వాహకులకు ప్రత్యేక బహుమతులను జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి చేతులమీదుగా అందజేశారు. పవన్ మోటర్స్, జావా ఎస్‌డీ బైక్స్ ఆధ్వర్యంలో లక్కీ డిప్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ అభిమన్యు శ్రీనివాస్, నమస్తేతెలంగాణ బ్రాంచ్ మేనేజర్ టీ మహేందర్, బ్యూరో ఇన్‌చార్జి మర్రి మహేందర్‌రెడ్డి, ఏడీవీటీ మేనేజర్ కే శివకుమార్, వివిధ విభాగాల ఇన్‌చార్జిలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
నల్లగొండ	44.5°c	25.2°c
ఆదిలాబాద్	44.4°c	25.5°c
మెదక్	43.2°c	24.0°c
రంగారెడ్డి	42.8°c	21.2°c
ఖమ్మం	42.0°c	26.0°c
కరీంనగర్	41.5°c	27.0°c
మహబూబ్‌నగర్	41.3°c	28.2°c
నిజామాబాద్	41.3°c	27.6°c
హైదరాబాద్	41.0°c	27.7°c
వరంగల్	40.0°c	26.0°c

మరో ఇద్దరు రైతుల ఆత్మహత్య

పంట దిగుబడులు రాక.. అప్పులు తీర్చలేక మనస్తాపంతో అన్నదాతల బలవన్మరణం

సిద్దిపేట, మానుకోట జిల్లాలో ఘటనలు

మిరుదొడ్డి/నర్సింహులపేట, ఏప్రిల్ 7: సాగు నీళ్లు లేక పంటలు ఎండిపోవడం.. అందుకోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక మరో ఇద్దరు రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటనలు మహబూబాబాద్, సిద్దిపేట జిల్లాల్లో చోటుచేసుకున్నాయి. వివరాలు ఇలా..

సిద్దిపేట జిల్లా తొగుట మండల కేంద్రానికి చెందిన చిక్కుడు శ్రీనివాస్ (48) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. తొగుటలో మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో భూమి పోవడంతో మిరుదొడ్డి మండలంలోని కాసులాబాద్‌లో నాలుగు ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేశాడు. ఎప్పటి మాదిరిగానే ఈసారి యాసంగి సీజన్‌లో 4 ఎకరాల్లో వరి వేశాడు. భూగర్భజలాలు అడుగంటి పోయి వేసిన వరి పంటకు సాగునీరు అందకపోవడంతో వరి పూర్తిగా ఎండు ముఖం పట్టింది. కూతురి పెండ్లి చేయడంతోపాటు ఎవుసానికి అప్పులు అయ్యాయి. వాటిని తీర్చే మార్గం లేక తీవ్ర మనస్తాపం చెందిన ఆయన శనివారం కాసులాబాద్‌లోని పొలం వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానిక రైతులు శ్రీనివాస్‌ను చికిత్స నిమిత్తం సిద్దిపేట జిల్లాకేంద్ర దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. మృతుడికి భార్య సుజాత, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

జాటోత్ శ్రీనుది అదే పరిస్థితి..

మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలోని రూప్లాతండా గ్రామ పంచాయతీ పరిధిలోని ఎర్రచకృతండాకు చెందిన జాటోత్ శ్రీను (40) మూడున్నర ఎకరాల మిరప, రెండెకరాల్లో పత్తి సాగు చేశాడు. మిరప సాగు కోసం రూ.5 లక్షల వరకు అప్పు చేశాడు. పంటకు చీడపీడలతోపాటు సాగునీరు లేకపోవడంతో నాలుగు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. అంతేగాక సాగునీరు లేక పత్తి పంట పూర్తిగా ఎండిపోయింది. నాలుగు క్వింటాళ్లు కూలీలకు కూడా సరిపోవని, అప్పులు ఎలా కట్టాలని దిగులు చెందాడు. అప్పుల విషయంలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో ఈనెల 4న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా, గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం మహబూబాబాద్ జిల్లా కేంద్ర దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య మాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంట చేతికి రాక పానం తీసుకుండు

"మా బాబాయికి వ్యవసాయం అంటే ఇష్టం. పిల్లలను బాగా చదివించాలనే కోరికతో ఎంతో కష్టపడి వ్యవసాయం చేస్తున్నడు. మూడున్నర ఎకరాల్లో మిరప తోట వేశాడు. దురదృష్టవశాత్తు నాటిన కొన్ని రోజులకే మొక్కలు చనిపోయాయి. మళ్లీ మిరప మొక్కలు నాటాడు. ఏపుగా వచ్చింది. గుబ్బ రోగం సోకింది. పంటను కాపాడుకునేందుకు ఎన్నో మందులు పిచికారీ చేశాడు. అయినా పంట చేతికి రాలేదు. అప్పులు ఎక్కువ కావడంతో ఇబ్బందిపడ్డాడు. పత్తి పంటకు పురుగుపట్టింది. పంట పెట్టుబడి కోసం రూ.5 లక్షలతోపాటు గతంలో ఉన్న రూ. 2 లక్షలు కలిపి మొత్తం రూ.7 లక్షలు అప్పు ఉండటంతో పంటలు పండక పోవడంతో బాధ పడుతుండేవాడు. ఎప్పుడు చూసిన అప్పులు ఎట్లా తీర్చిలాని బాధ పడేవాడు. నీళ్లు లేక యాసంగి పంటలు వేయలేదు. ఇలా పానం తీసుకుంటడని అనుకోలే. మా బాబాయి కుటుంబాన్ని ప్రభుత్వమే అదుకోవాలి.

- జాటోతు రమేశ్ ఎర్రచకృతండా (మృతుడి అన్న కొడుకు)

నాడు.. నేడు అదే ఉరితాడు

20ఏండ్ల క్రితం భర్త, ఇప్పుడు కొడుకు

ఎవుసం అప్పులు తీర్చలేక ఇద్దరూ ఆత్మహత్య ● నిలువ నీడలేక పుట్టింట్లో జీవనం

రైతు బీమా సాయం కోసం ఎదురుచూపులు ● కన్నెత్తి చూడని ప్రభుత్వ అధికారులు

కన్నాయిగూడెం, ఏప్రిల్ 7 : ధారగా కారుతున్న కన్నీళ్లతో కొడుకు ఫొటో వద్ద దిగాలుగా నిల్చున్న ఈ అవ్వ పేరు అగ్గు అనసూయ. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం గుర్రేవుల ఈమె పుట్టినూరు. ఈమెకు 35 ఏండ్లక్రితం భూపాలపల్లి జిల్లా పలిమెల మండలం లెంకలగడ్డ గ్రామానికి చెందిన మల్లయ్యతో లగ్గం చేసిండ్రు. లెంకలగడ్డలో మూడెకరాలతో భూమిని నమ్ముకుని ఎవుసం మొదలుపెట్టిన ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు. ఒక కొడుకు, ఒక కూతురుతో హాయిగా సాగుతున్న వీరి సంసారంలో పెట్టుబడికి చేసిన అప్పులు నిప్పులు పోశాయి. కొడుకుకు పదేండ్ల వయస్సునప్పుడు అప్పులు పెరిగి తండ్రి మల్లయ్య ఆత్మహత్య చేసుకున్నాడని అగ్గు అనసూయ బోరున విలపిస్తూ చెప్పింది. అత్తగారి ఊరు అయిన లెంకలగడ్డలో ఉండలేక తల్లిగారి ఊరు అయిన గుర్రేవులకు వచ్చి కూలి పనులు చేసి కొడుకును, బిడ్డను పెంచి పెద్ద చేశానని తెలిపింది. బిడ్డ పెండ్లీ చేసిన తర్వాత కొడుకుతో కలిసి గుర్రేవులలోనే తాను కూలి పని, కొడుకు ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేసుకుంటూ జీవిస్తున్నామని చెప్పింది. నాలుగేండ్ల నుంచి కాలం కలిసి రావడంతో కొడుకు మధు లెంకలగడ్డలో ఉన్న భూమిని కౌలు కిచ్చి, గుర్రేవులలో భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం మొదలుపెట్టాడని చెప్పింది. నిరుడు గుర్రేవులకు చెందిన తడుకల మల్లయ్యకు చెందిన ఎకరంన్నర పొలాన్ని కౌలుకు తీసుకొని మిర్చి పంట సాగు చేస్తే.. రెండు లక్షల అప్పు అయిందని తెలిపారు. మిర్చి దిగుబడి రాలేదని, అప్పు ఎట్లా కట్టాలని బంధువులు, స్నేహితులతో తన బాధ చెప్పుకుంటూ మధుకర్ మదనపడ్డాడని అనసూయ వివరించారు. ఫిబ్రవరి 9వ తేదిన ఉదయం బంధువులకు ఫోన్ చేసి తాను బతకడల్చుకోలేదని, అప్పుల బాధతో పురుగుల మందు తాగి చనిపోతున్నానని చెప్పాడని, అదే నా కొడుకు ఆఖరి మాటని ఆమె భోరున విలపించింది. బంధువులు తెలిపిన సమాచారంతో గ్రామస్తుల సహకారంతో చుట్టు పక్కల వెతుకుతుండగా గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో పురుగుల మందు తాగి స్పృహ లేనిస్థితిలో కొడుకు కనిపించాడని చెప్పింది. అంబులెన్సులో ఏటూరునాగారం దవాఖానకు తరలిస్తుండగా రొయ్యూరు గ్రామానికి చేరుకునే సరికి ప్రాణం విడిచాడని రోదిస్తూ వివరించింది. కట్టుకున్న మొగుడు ఆగం చేస్తే.. కంటికి రెప్పలా కాపాడుకున్న కొడుకు సాకుతడని కలలు కన్నానని... కానీ అప్పుల బాధకు కండ్ల ముందే దూరమయ్యాడని కన్నీటి పర్యంతమైంది. చెట్టంత కొడుకు దూరమయ్యాక తనకు దిక్కెవరని గుండెలు బాదుకున్నది.

మధు చిత్రపటం వద్ద తల్లి అనసూయ, మేనమామ, అమ్మమ్మ

పలుకరించని పాలకులు

20 ఏండ్ల క్రితం భర్త, ఇప్పుడు కొడుకు మరణంతో పుట్టెడు దుఖంలో ఉన్న అగ్గు అనసూయను ఓదార్చేవారే కరువయ్యారు. సోదరుడు, తల్లితో కలిసి ఉంటున్న ఆమె నిలువనీడ లేక అనాథగా మిగిలిపోయింది. మధుకర్ మృతి చెందిన అనంతరం వారి కుటుంబ సభ్యులను ఇటు ప్రజాప్రతినిధులు కానీ, అటు అధికారులు కానీ కనీసం పలుకరించలేదు. వారి వివరాలు తెలుసుకునే ప్రయత్నం కూడా చేయలేదు. దహన సంస్కారాల సమయంలో గ్రామానికి చెందిన కొందరు నాయకులు 50 కేజీల బియ్యం, రూ.2500 నగదును మాత్రం అందజేశారని అనసూయ తెలిపింది. ప్రస్తుతం లెంకలగడ్డ గ్రామంలో సర్వే నంబర్ 7/4లో 2ఎకరాల పట్టా భూమి మధుకర్ పేరుపై ఉందని, రైతు బంధు పైసలు కూడా ఇటీవల పడ్డాయని చెప్పింది. మరణ ధ్రువీకరణ పత్రం వచ్చిన అనంతరం రైతు భీమాకు దరఖాస్తు చేసుకుంటానని చెప్పింది. రైతు బీమా సాయం అందించడంలో అధికారులు సహకారం అందించాలని కోరుతున్నది.

మధు నివాసం వద్ద తల్లి అనసూయ, మేనమామ, అమ్మమ్మ

డాక్టర్‌పై యూత్ కాంగ్రెస్ నేత బూతు పురాణం

- ఫోన్ ఎత్తలేదని రాయలేని భాషలో తిట్లు
- ములుగు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రవిచందర్ దౌర్జన్యం
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తా: సూపరింటెండెంట్ జగదీశ్వర్ వెల్లడి

ములుగు, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ): ములుగు జిల్లా కేంద్ర ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వర్‌ను యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రవిచందర్ దుర్భాషలాడాడు. ఫోన్ చేసి మరీ నోటికొచ్చినట్టు తిట్టాడు. ఈ ఆడియో ఆదివారం రాత్రి సోషల్ మీడియాలో వైరల్ అయింది. ములుగు మండలం జీవంతరావుపల్లి గ్రామానికి చెందిన బానోత్ రవిచందర్ కాంగ్రెస్ పార్టీ యూత్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. ఆదివారం రాత్రి తన మేనమామ రోడ్డు ప్రమాదానికి గురికాగా ములుగు ప్రభుత్వ దవాఖానకు చికిత్స నిమిత్తం తీసుకువచ్చాడు. అక్కడికి చేరుకున్న రవిచందర్ పలుమార్లు దవాఖాన సూపరింటెండెంట్‌కు ఫోన్‌చేశాడు. చివరి క్షణంలో సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వర్ ఫోన్ ఎత్తి మాట్లాడగా రవిచందర్ ఆయనపై ఆవేశంతో ఊగిపోయారు. 'నేను యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిని. ఎన్నిసార్లు ఫోన్ చేసిన నీకు రెస్పాన్స్ లేదా? నీకు కొద్దిగ కూడా బాధ్యత లేదా? ఫోన్ లేపవు. మరి ఏంది అని అడుగవు. ఇంకో ఫోన్ మాట్లాడుతవు. ఈడ యాక్సిడెంట్ అయింది. ఎవరు పట్టించుకుంటలేరు. నీకు ఏమైనా బుద్ధి, సిగ్గు, శరం ఉందా? ఇన్నిసార్లు ఫోన్లు చేసినప్పుడు ఏం జరిగిందో తెలుసుకుందామని లేదా? బాధ్యతాయుతమైన సూపరింటెండెంట్ పదవిలో ఉన్నవ్. నువ్వు తమాషా చేస్తానవ్, డ్రామాలు చేస్తావ్. నీకు మానం లేదు.. నా ఫోన్ ఎన్నిసార్లు రింగ్ అయ్యిందో చూడు. కనీస పట్టింపు లేదు. ఎవరో కాదు నేను యాక్సిడెంట్ అయిన వాళ్ల మేన అల్లుడిని. నివ్వు సూపరింటెండెంట్‌వని ఫోన్ చేసిన. నువ్వు లేపి గిది పరిస్థితి మరి అని చెప్పవా?' అని నోటికొచ్చినట్టు మాట్లాడాడు. మర్యాదగ మాట్లాడాలి అని సూపరింటెండెంట్ సూచించినా సదరు నేత మరింత రెచ్చిపోయి రాయలేని భాషను ఉపయోగించాడు.

చట్టప్రకారం వెళ్తా..

ఆదివారం సెలవు రోజు కావడంతో ఇంటి వద్ద ఉన్నా. రెండు, మూడు సార్లు బానోతు రవిచందర్ ఫోన్ చేశాడు. చివరి క్షణంలో ఫోన్ లిఫ్ట్ చేశాను. హలో అన్నది మొదలు 5 నిమిషాలపాటు భరించలేని బూతులు తిట్టాడు. డ్యూటీలో డాక్టర్ ఉన్నాడని చెప్పినా వినకుండా అగౌరవపర్చే విధంగా మాట్లాడాడు. అతని మేనమామకు రోడ్డు ప్రమాదం జరిగితే డ్యూటీ డాక్టర్ వైద్యం చేసి పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్‌కు రెఫర్ చేశాడని, ఈ విషయాన్ని చెబుతున్నా వినే పరిస్థితిలో లేకుండా నాన్ స్టాప్‌గా తిట్టాడు. నా వద్ద ఉన్న ఆధారాలతో సోమవారం పోలీస్ స్టేషన్‌లో రవిచందర్‌పై కేసు పెడతా. ఈ విషయాన్ని వైద్యులతో చర్చించి విధులను బహిష్కరిస్తాం.

- డాక్టర్ జగదీశ్వర్, ములుగు దవాఖాన సూపరింటెండెంట్, డీసీహెచ్‌ఎస్

● నల్లమల అడవిలో కార్చిచ్చు

నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమల అడవిలో చెట్లకు మంటలు అంటుకున్నాయి. అమ్రాబాద్ మండలం మన్ననూర్ పడమర బీట్ తాళ్లచెల్క, గుండం ఏరియాలోని అటవీ ప్రాంతంలో శనివారం అర్ధరాత్రి అకస్మాత్తుగా మంటలు రేగాయి. విషయం తెలుసుకున్న అటవీశాఖ సిబ్బంది రెండు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. - అమ్రాబాద్

రాష్ట్రంలో అగ్నిప్రమాదాల నివారణ భేష్

- ప్రముఖ పర్యావరణవేత్త ఎరిక్ సోల్హెమ్ ప్రశంసలు
- వారి మాటలు స్ఫూర్తినిస్తాయి: మంత్రి సురేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ) : అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు రాష్ట్ర అటవీశాఖ చర్యలను ప్రముఖ పర్యావరణవేత్త ఎరిక్ సోల్హెమ్ ప్రశంసించారు. ఈ మేరకు ఎరిక్ సోల్హెమ్ ఆదివారం ఎక్స్‌లో తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ పోస్ట్ చేశారు. అటవీ సిబ్బందికి అడవుల్లో సంభవించే అగ్ని ప్రమాదాలను ఎదుర్కోవటం, మంటలను ఆర్పడం అత్యంత కష్టతరమైనదే కాకుండా సవాలుతో కూడుకున్నదని పేర్కొన్నారు. అడవుల్లో విస్తరిస్తున్న మంటలను ఆర్పుతున్న సిబ్బందిని హరిత సైనికులు (గ్రీన్ సోల్జర్స్) గా ఎరిక్ సోల్హెమ్ అభివర్ణించారు. వీరు ప్రాణాలకు తెగించి పోరాడుతున్నదునే అడవులు, వన్యప్రాణులకు రక్షణ లభిస్తున్నదని తెలిపారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులు, సిబ్బందికి ఎరిక్ అభినందనలు తెలిపారు. కాగా, ఎరిక్ సోల్హెమ్ రాష్ట్ర అటవీశాఖపై, అటవీ సిబ్బంది పనితీరును ప్రశంసించినందుకు రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేశ కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ అటవీ శాఖ మరింత ఉత్తేజంతో పనిచేసేందుకు వారి మాటలు స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు.

కరువు వేధించినా కంది సాగు లాభమే

ప్రతికూలతలను తట్టుకోగలిగే వంగడాలను అభివృద్ధి చేసిన ఇక్రిశాట్

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ): వేసవి తీవ్రత నానాటికీ అధికమవుతుండటంతో ప్రస్తుతం ఎన్నో ప్రాంతాలు నీటి ఎద్దడితో తల్లడిల్లుతున్నాయి. ఇలాంటి కరువు పరిస్థితుల్లోనూ రైతులు కంది సాగుతో అధిక దిగుబడి పొందవచ్చని ఇక్రిశాట్ పరిశోధకులు చెప్తున్నారు. ఏడాదిలో మొత్తంగా 65 సెంటీమీటర్ల కంటే తక్కువ వర్షపాతం నమోదైనప్పటికీ కంది సాగు చేపట్టవచ్చని స్పష్టం చేస్తున్నారు. కందులకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉండటంతో ఇక్రిశాట్ ఇప్పటికే పలు రకాల వంగడాలను అభివృద్ధి చేసింది. వాటిలో కొన్ని రకాల వంగడాలకు వర్షాభావం, నీటి ఎద్దడి, అధిక ఉష్ణోగ్రత తదితర ప్రతికూల పరిస్థితులను తట్టుకునే సామర్థ్యం ఉండటంతో ఇప్పటికే ఎన్నో దేశాల్లో సాగు చేస్తున్నారు. నీటి అవసరం, నిర్వహణ ఖర్చులు తక్కువగా ఉండే ఇలాంటి రకాల సాగుతో రైతులకు ఆదాయంతోపాటు మరెన్నో ప్రయోజనాలు కలుగుతాయని పరిశోధకులు చెప్తున్నారు. అధిక పోషకాలు ఉండే కందులను జొన్న, మొక్కజొన్న, మినుముతో కలిపి సాగు చేయవచ్చని అంటున్నారు.

చావుపైనా రాజకీయం!

మొదటిపేజీ తరువాయి...

విచారణకు వచ్చిన అధికారుల బృందం మాత్రం కడుపునొప్పి తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పడం గమనార్హం. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం మద్దిగట్లకు చెందిన రైతు శ్రీశైలం(30) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకోవటంపై శనివారం 'నమస్తే తెలంగాణ' ప్రధాన సంచికలో కథనం ప్రచురితమైంది. దీంతో ఆత్మహత్యపై విచారణ చేపట్టాలని కలెక్టర్ రవినాయక్ ఆదేశించటంతో భూత్పూర్ తహసీల్దార్ రాజు, వ్యవసాయ శాఖాధికారి మురళీధర్, ఎస్సై శ్రీనివాసులు రైతు శ్రీశైలం ఇంటికి వెళ్లి చుట్టుపక్కల వారిని విచారించారు. అనంతరం రైతు పొలాన్ని పరిశీలించి స్థానికుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కడుపునొప్పి భరించలేక తన భర్త ఆత్మహత్య చేసుకొన్నాడంటూ మృతుడి భార్య శ్రీశైల స్టేట్‌మెంట్ ఇచ్చారని తహసీల్దార్ రాజు వెల్లడించారు. మృతుడి పొలానికి కూడా వెళ్లి పరిశీలించామని, పంటను హార్వెస్టర్‌తో కోశారని వివరించారు. మృతుడి భార్య, గ్రామస్థుల స్టేట్‌మెంట్ల ఆధారంగా జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపిస్తానని పేర్కొన్నారు. ఎట్టకేలకు రైతు ఆత్మహత్యపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అప్పగించగా, బంధువులు అంత్యక్రియలు పూర్తిచేశారు.

సర్వే నంబర్ 574లో రైతు శ్రీశైలం పక్క పొలాన్ని పరిశీలిస్తున్న భూత్పూర్ మండల అధికారులు

రైతు శ్రీశైలం పొలంలో ఎండిపోయిన వరి పంట, వట్టిబోయిన బోరు

కాంగ్రెస్ నేతల హల్‌చల్

మద్దిగట్లలో రైతు ఆత్మహత్య చేసుకున్న విషయం 'నమస్తే తెలంగాణ'లో రావడంతో గ్రామంలోని కొందరు కాంగ్రెస్ నేతలు హడావుడి చేశారు. రైతు ఆత్మహత్య విషయం ప్రభుత్వానికి మచ్చగా మారుతుందని, అలా జరగకుండా మేనేజ్ చేయాలని వారిని ఆదేశించినట్టు తెలిసింది. దీంతో నిజానిజాలు తెలుసుకొనేందుకు వెళ్లిన 'నమస్తే తెలంగాణ' ప్రతినిధుల వెంటే కాంగ్రెస్ నేతలు కూడా ఉన్నారు. 'నమసే తెలంగాణ' బృందానికి మృతుడి చుట్టుపక్కల వారంతా అప్పుల బాధతోనే శ్రీశైలం ఆత్మహత్య చేసుకున్నాడని ముక్తకంఠంతో వెల్లడించారు. మృతుడి భార్య కూడా అప్పులబాధ తాళలేకే తన భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. ఇద్దరు పిల్లలను అనాథలుగా చేసి వెళ్లిపోయాడని భోరున విలపించారు. తన పిల్లలు చిన్నవాళ్లు అని, వాళ్లను ఎలా పోషించాలో తెలియటం లేదంటూ కన్నీరుమున్నీరయ్యారు. మృతుని భార్యతో, స్థానికులతో నమస్తే తెలంగాణ బృందం మాట్లాడేటప్పుడు కాంగ్రెస్ నాయకులు నిఘా పెట్టారు. రైతు ఆత్మహత్య చేసుకోలేదని అక్కడున్నవారిని మార్చే ప్రయత్నం చేశారు. అధికారులు వచ్చినప్పుడూ వారి వెంటే ఉండి కావాల్సిన రీతిలో సమాచారం ఇప్పించి స్టేట్‌మెంట్లపై సంతకాలు పెట్టించినట్టు కొందరు గ్రామస్థులు ఆరోపించారు. సీఎం సొంత జిల్లా కావటంతోనే రైతు ఆత్మహత్యను కప్పిపెట్టేందుకు అధికార యంత్రాంగం ప్రయత్నించిందని విమర్శలు వెల్లువెత్తాయి. ఆత్మహత్య చేసుకొంటే డబ్బులు రావని, కడుపునొప్పితో చనిపోతే రైతు బీమా వస్తుందని, ప్రభుత్వం తరపున రూ.5 లక్షల సాయం ఇస్తామని రైతు కుటుంబాన్ని ఒప్పించారని గ్రామస్థులు తెలిపారు. మరోవైపు శ్రీశైలం పొలం ఎండిపోయినట్టు స్పష్టంగా కనిపిస్తున్నది. కొత్తగా బోరు వేసిన ఆనవాళ్లు కూడా ఉన్నాయి. మరో బోరులో ఫ్లషింగ్ చేసినా అందులో నీళ్లు రాలేదు. మరోచోట డ్రిల్లింగ్ చేయించినా అదే పరిస్థితి. కానీ అధికారులు మృతుడి పొలం బాగానే ఉన్నదని, కోత దశకు రావటంతో వరి పంటను హార్వెస్టర్‌తో కోశారని చెప్పడం గమనార్హం. అలాంటప్పుడు రైతు పొలంలో పండిన ధాన్యం ఎక్కడున్నది? ఆ పంటను ఎవరికి అమ్మారు? రసీదులు ఉన్నాయా? అంటే ఈ ప్రశ్నలకు అధికారుల వద్ద జవాబే లేదు.